

పి. పాపిరెడ్డి

ఆడకూతురి బతుక్కోసం కూడ బెట్టింది. దాన్ని ముట్టుకుంటే భగవంతుడు కూడా మనల్ని క్షమించడు" అన్నాడు. వల్గురు మారుమాట లేకుండా పక్కకు తప్పుకున్నారు.

తోపు దాటించి వెనుదిరిగిన వ్యక్తి చేతులను తన చేతుల్లోకి తీసికొని కళ్ళ కద్దుకొని "నీకు కొడుకునై పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను బాబు" అన్నాడు తాత. ముడతలు పడ్డ చెక్కిళ్ళ మీద జారే కన్నీటి చుక్కలు తుడిచి ఆనందంగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

పట్నం పొలిమేరలో మండల ప్రజాపరిషత్తు కార్యాలయం కనపడేసరికి తాతకు తన పట్టా సంగతి గుర్తొచ్చింది. యం.ఆర్.వో పట్టాల రామయ్యను కలుసుకొని తన పొలం సంగతి విన్నవించుకొన్నాడు తాత. అయ్యగారు ఆర్డై ఆంజనేయుల వైపు చూపారు. ఆంజనేయులు రంగయ్య తాత వాలకం చూచి హెడ్ గుమస్తా వీరభద్రాన్ని చూపాడు. వీరభద్రం కాగితాల మధ్యన దూరిన గణపతిని చూపాడు. గణపతి విసుగ్గా చూచి అయ్య గార్ని కలవమని మరల కట్టల్లో దూరాడు. 'కథ తిరిగి మొదటికొచ్చిందే' అనుకుంటూ ఏమి చేయాలో తోచక నిలుచున్న రంగయ్య తాతను అటెండరు అప్పారావు ఆపద్బాంధవునిలా ఆదుకున్నాడు. పార్థునికి పార్థసారధిలా గీతను బోధించాడు. "తాతా నా మాట వినుకో. ముందు గణపతి పూజ చేసుకో. ఆ తర్వాత ఆ ప్రక్కనే ఉన్న వీరభద్రయ్య గార్కి కానుకెయ్యి. ఆ తర్వాత ఆర్డై ఆంజనేయులు గార్కి దక్షిణ వేసి దండం పెట్టు. అప్పుడెళ్ళి మూల విరాట్టుకు ముడుపులు చెల్లించుకో. అప్పుడు నీ పని క్షణాల మీద జరిగి పోద్ది" అన్నాడు అప్పారావు.

"అదేదో నీవే చేసి పెట్టు నాయనా, పాత కాలపు ముసిలోన్ని, ఇవన్నీ నాకేమీ తెలుసు?" అన్నాడు రంగయ్య తాత.

"అసలు జేబులో ఎంతుందో చూడు" అన్నాడు అప్పారావు.

రంగయ్య తాత జేబులోంచి పొట్లం తీసి "కూతురి కాపురం నిలబెట్టడానికి గుడ్డల కోసం వచ్చాను బాబు. రెండొందలకు తీసుకపోతాను. ఈ వంద తీసుకోని పని చేసి పెట్టు బాబు" అన్నాడు రంగయ్య తాత.

అద్దం పగిలినట్లు ఫళ్ళున నవ్వాడు హెడ్ గుమస్తా వీరభద్రం. "బజారుకు వెళ్ళి బొరుగులు కొనుక్కో. పిల్లోల్లకు పెడితే పుణ్యం వస్తది" అన్నాడు.

ఆర్డై ఆంజనేయులు అందుకున్నాడు. "అదేంటి పెద్దాయినా. నీ పొలం మీద ఎంత ఒత్తిడి వచ్చిందనుకున్నావ్. ఒక్క మాటరాస్తే నీ పట్టా ఎగిరి పోతుంది. కన్న కూతురుంటున్నావు గనక చెప్తున్నా, ఆడ పిల్ల తండ్రివి. ఆలస్యం చేస్తే అన్యాయమై పోతావు" అంటూ "ఆ పొట్లం ఇట్లా పట్టుక రావోయ్ అప్పారావు. ఎట్లాగో ఆ మూడొందలతోనే ముడిపెట్టవయ్యా వీరభద్రం. ఏ చేస్తాం? ఖర్మ!" అంటూ విసుక్కుంటూ ఫైళ్ళు కెలికి ఒక కాగితం పైకి తీసాడు. "దీని మీద వేలు ముద్ర వెయ్యవయ్య పెద్దయ్య" అంటూ ఆ కాగితం ముందుకు తోసాడు ఆంజనేయులు. వేలు ముద్ర వేసిన కాగితం, నోట్ల పొట్లం ఆంజనేయుల కప్పజెప్పి అవతల కేసును 'టేకప్' చేయడానికి ఆనందంగా వెళ్ళాడు అప్పారావు.

ఒట్టి చేతులతో ఇల్లు చేరిన రంగయ్య తాతను చూచి వాకిట్లోనేని లేసి "చీరలేవీ?" అంది సీతమ్మవ్వ. "డబ్బులు దొంగలు కొట్టేశారు" అన్నాడు రంగయ్య తాత నింపాదిగా.




10-11-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

## అదీ సంగతి

సత్యమూర్తి ప్రవర్తన నాకేం నచ్చలేదు. బంగారం లాంటి సంబంధం ఎందుకు కాదంటున్నాడో అర్థం కాలేదు.

సత్యమూర్తికి ముగ్గురు అమ్మాయిలు. పెద్ద అమ్మాయిని బ్యాంకు ఆఫీసరుకిచ్చాడు. రెండో అమ్మాయిని ఆర్టీసీ కండక్టర్‌కిచ్చాడు. ఇహ మూడో అమ్మాయి పెళ్ళికోసం తిరగని ఊరు అంటూ లేదు. నెతకని సంబంధం అంటూ లేదు. అటువంటి సమయంలో మంచి సంబంధం దొరికింది.

అబ్బాయి బ్యాంకులో ఆఫీసర్‌గా చేస్తున్నాడు. అందంగా వున్నాడు. పైగా కట్నం చాలా తక్కువ. అటువంటి సంబంధం ఎందుకు ఇష్టపడడం లేదో వాడి స్నేహితుడిగా తెలుసుకోలేక పోతున్నాను.



ఈ విషయమై వాడి పెద్ద కూతురుతో మాట్లాడదామని వాళ్ళ ఊరు వెళ్ళాను. అదో పల్లెటూరు. ఇల్లు కష్టం లేకుండా పట్టుకోగలిగాను.

అక్కడి పరిస్థితి చూసి నా నోటి వెంట మాట రాక అలా నిల్చుండిపోయాను. సావిత్రి దొడ్లో పిడకలు చేస్తూంది. వాళ్ళాయన గేదెల్ని గడ్డి పెట్టి తోముతున్నాడు.

విషయమేమిటంటే ఆ ఊళ్లో వాళ్లకి గేదెలు, ఆవులు కొనుక్కోమని అప్పులు ఇచ్చార ట! తీసుకున్న అప్పులు ఎంతకీ తీర్చడం లేదని, తీసుకున్న అప్పులు తీర్చమని బ్యాంకు వాళ్లు అడిగేసరికి వాళ్లంతా "అప్పులు తీర్చడానికి మా దగ్గర డబ్బులు లేవు. కావాలంటే మీరిచ్చిన గేదెలు, ఆవులు తీసుకోండని ఈ ఆఫీసర్ ఇంట్లో వదిలి వెళ్ళిపోయార ట.

సత్యమూర్తి ఆ బ్యాంకు ఆఫీసర్ సంబంధం ఎందుకు ఇష్టపడడం లేదో ఇప్పుడు అర్థమైంది!

— "అభిమన్యు"